క్లుప్తంగా

జాగ్రత్తగా ఉండాలి



వాజేడు: వర్షాకాలంలో గోదావరి వరదలు వచ్చే అవకాశాలు ఉన్నాయని ప్రజలు ఆ సమయంలో జాగ్రత్తగా ఉండాలని పేరూరు ఎస్సై గొర్ల రమేష్ అన్నారు. మండల పరిధిలోని కృష్ణాపురం, కడేకల్ గ్రామాల్లో గ్రామస్తులతో ఆయన మాట్లాడారు. గోదావరి వరదలు వచ్చే సమయంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వరదల పరిస్థితిని అధికారుల ద్వారా తెలుసుకుని ఎప్పటికప్పుడు సమాచారం ఇస్తామన్నారు. ఆ సమయంలో ఎలాంటి సాయం కావాలన్నా సహకరించడంతో పాటు అన్ని శాఖల అధికారుల సమన్వయంతో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. ప్రజలు తమకు సహకరించాలని సూచించారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి



ఏటూరునాగారం: గ్రామంలో పారిశుద్ధ్యం ప్రత్యేక దృష్టి పెట్టినట్లు గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి దామోదరస్వామి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో సీజనల్ వ్యాధులపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. మురుగు కాల్వల్లో ఆయిల్ బాల్స్ వేయాలని, ఫాగింగ్ చేయాలని, జ్వరాలు ఉంటే క్యాంప్‌లు ఏర్పాటు చేయాలన్నారు. కాలన్లో చెత్తాచెదారం తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఆశ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి జ్వరపీడితులను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అంతటి విజయ, జెడ్పీ కోఆప్షన్ సభ్యురాలు వలియాబీ, కార్యదర్శి రమాదేవి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ



వెంకటాపురం(కె): కర్రిగుట్టల అడవుల్లో మావోయిస్టులు అమర్చిన బాంబు దాడిలో గాయపడిన చొక్కాల గ్రామానికి చెందిన సునీతకు గ్రామస్తులు ఆర్థిక సాయం చేశారు. శుక్రవారం ఓడబలిజ సేవా సంఘం, గ్రామస్తులు కలిసి రూ.1.20లక్షలను సునీత భర్త మహేష్‌కు వైద్య ఖర్చుల నిమిత్తం అందజేశారు. కాగా భద్రాచలం వైద్యశాలలో ఉన్న సునీతను భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ పరామర్శించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు డర్రా దామోదర్, తోట నాని, రవి, పోతురాజు, దివాకర్ తదితరులు ఉన్నారు.

ఆర్థిక సాయం

ఏటూరునాగారం: ఆశ్రమ గిరిజన బాలికల పాఠశాలలో చదువుకుంటున్న ఇద్దరు గిరిజన విద్యార్థినులకు సీఐ రాజు ఒక్కొక్కరికీ రూ.5వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. కన్నాయిగూడెం మండలంలోని సింగారం గ్రామానికి చెందిన గిరిజన విద్యార్థిని ఆలం శ్వేత పంజాబు రాష్ట్రంలో ఎన్ఐటీ జలందర్‌లో ఇంటిగ్రేటెడ్ బీఎస్సీ, బీఈడీలో సీటు వచ్చింది. అలాగే ఏటూరునాగారం మండలంలోని రామన్నగూడెం గ్రామానికి చెందిన గిరిజన విద్యార్థిని కోడి శశాంక ఎన్ఐటీ పుదుచెర్రిలో ఇంటిగ్రేటెడ్ బీఎస్సీ బీఈడీ సీటు రావడం జరిగింది. అయితే వీరికి ఆర్థిక ఇబ్బందులు ఉండడంతో చదువును ముందుకు సాగించలేకపోతున్నారు. విషయం తెలుసుకున్న సీఐ రాజు వారికి ఆర్థిక సాయం అందజేశారు. ఉన్నత చదువులు చదువుకొని పేద వారికి అండగా ఉండాలని విద్యార్థులను సీఐ కోరారు. సాయం చేసినందుకు ఉపాధ్యాయులు చెంచయ్య, ఏసీఎంఓ రవీందర్ సీఐకి కృతజ్ఞతలు తెలిపారు.

బడీడు పిల్లలను బడికి పంపించాలి



వెంకటాపురం(కె): గ్రామాల్లో ఉన్న బడీడు పిల్లలను బడికి పంచించాలని కాఫెడ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం మంగవాయి గ్రామంలో గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అలాగే చిన్న పిల్లాలకు మొబైల్ ఫోన్లు ఇవ్వటం వల్ల కలిగే నష్టలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కాఫెడ్ స్వచ్ఛంద సంస్థ వెంకటాపురం మండల కోఆర్డినేటర్ గొంది హనుమంతు, వాజేడు కోఆర్డినేటర్ కామేష్, సభ్యులు పద్మ, ఇందిరా, ఉషారాణి, ప్రశాంత్, నరేష్ ఉన్నారు.

పాఠశాలల్లో సామూహిక అక్షరాభ్యాసం



ములుగు రూరల్: సామూహిక అక్షరాభ్యాసం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



వాజేడులో..



ఏటూరునాగారం: పప్కాపురంలో..



గోవిందరావుపేటలో అక్షరాభ్యాసం చేయిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

గోవిందరావుపేట: మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం అధికారులు, ఉపాధ్యాయులు సాముహిక అక్షరాభ్యాసం, పుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మండల విద్యాశాఖ అధికారి గొంది దివాకర్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిలుగా జిల్లా విద్యాశాఖ అధికారి పాణిని, ఎంపీపీ సూడి శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ సృజన్ కుమార్, ఎంపీడీఓ జవహర్‌రెడ్డి హాజరైయ్యారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి పాణిని మాట్లాడుతూ... ప్రభుత్వం పాఠశాలల్లో అనేక సౌకర్యాలు కల్పించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ సాజిద బేగం, కార్యదర్శి శంకర్, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ కోమల స్వరూప, భవాని, ఉపాధ్యాయులు రఘురాం, తల్లిదండ్రులు, విద్యార్థులు, ఎమ్మార్సీ సిబ్బంది బి విష్ణు తదితరులు పాల్గొన్నారు.

ములుగు రూరల్: మండలంలోని మదనపల్లి, బరిగాలపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ మేరకు శుక్రవారం మండల విద్యాశాఖ అధికారి సామల శ్రీనివాసులు ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందించారు. ఎంఈఓ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను పంపించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పోరిక విజయ్‌రాంనాయక్, పంచాయతీ కార్యదర్శి నర్సయ్య, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ భుర్గు మమత, త్రివేణి, ఉపాధ్యాయులు పాడ్య శివరాం, వెంకటస్వామి, అంగన్‌వాడీ టీచర్ లత, విజయ పాల్గొన్నారు.

వాజేడు: బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నాగారం ప్రాథమిక పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని ఎంఈఓ వెంకటేశ్వరరావు చేతుల మీదుగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులు చదువుతున్న విధానాన్ని ఉపాధ్యాయుల ద్వారా తెలుసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాల్లో అన్ని రకాల మౌలిక వసతులతో పాటు మంచి భోజనాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులకు ఎంఈఓ చేతుల మీదుగా పుస్తకాలు, స్కూల్ యూనీఫాంలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఎఫ్ఎల్ఎన్ నోడల్ ఆఫీసర్ స్వరూప్ సింగ్, ప్రధానోపాధ్యాయుడు బాలాజి ఉన్నారు.

ఏటూరునాగారం: మండలంలోని పాప్కాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయుడు మొహమ్మద్ సర్వర్ అహ్మద్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు మల్లయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా అక్షరాభ్యాసం, విద్యార్థులకు దుస్తుల పంపిణీ, పుస్తకాల పంపిణీ చేశారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ వివోజానపట్ల కుమారి, ఉపాధ్యాయురాలు సబిహ అమతుర్ రెహమాన్, అంగన్‌వాడీ టీచర్ లలిత కుమారి, విద్యార్థుల తల్లిదండ్రులు, యువజన సంఘం నాయకులు, మహిళా సంఘ నాయకురాలు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బొడ్రాయి వార్షికోత్సవం



బొడ్రాయి వద్ద పూజలు చేస్తున్న భక్తులు



పాలాభిషేకాలను చేస్తున్న పూజారులు, భక్తులు

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని బొడ్రాయిని ప్రతిష్ఠించి 12 సంవత్సరాలు కావడంతో శుక్రవారం వార్షికోత్సవ పూజలను పండితుడు యల్లాప్రగడ రాధాకృష్ణశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. బొడ్రాయికి ఉదయం భక్తులు పాలాభిషేకం, జలాభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బోనాలను సమర్పించి ప్రత్యేక అర్చనలు చేశారు. భక్తులతో బొడ్రాయి ప్రాంతం రద్దీగా మారింది. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. శనిగల ప్రసాదాన్ని, నూతన వస్త్రాలను పోగుల లక్ష్మీనారాయణ, వేణుగోపాల్ దంపతులు అందజేశారు. కత్తెర శ్రీనివాస్, జూపాక రాజేష్, జయంత్, కుమార్, రమేష్, మహేందర్, శివ, సతీష్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతలేని రోడ్డు తొలగించాలి

ఏటూరునాగారం: మండలంలోని రామన్నగూడెం నుంచి కమలాపురం వరకు బీటీ రోడ్డు నాణ్యత లేకుండా నిర్మించారని వెంటనే తొలగించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు మాట్లాడతూ.. రూ.6.30కోట్లతో చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణం పనులను మొదలు పెట్టిన కాంట్రాక్టర్ నాణ్యతకు తిలోదాకలు ఇస్తూ నిర్మాణం చేపడుతున్నాడని, వేసిన గంటలోనే రోడ్డు మొత్తం పెచ్చులూడిపోతుందని అన్నారు. వెంటనే ఆరోడ్డును తొలగించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి చెడ్డపేరు రాకుండా చూడాలన్నారు. రోడ్డు వెడల్పు చేసేందుకు కూడా తాము సహకరిస్తామన్నారు. మంత్రి సీతక్క ఆదేశాల మేరకు రోడ్డు పరిశీలించి దిగబడిన రోడ్డు మళ్లీ వేయించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఖలీల్, లాలయ్య, ఎల్లయ్య, నర్సింగరావు, రవి, బాలరాజు పాల్గొన్నారు.



అధికారులు, కాంట్రాక్టర్లతో మాట్లాడుతున్న నాయకులు

ఆందోళనకు దిగిన ప్రజలు

బీటీ రోడ్డు నాణ్యతలేదని, రోడ్డు దిగబడుతుందని స్థానిక రామన్నగూడెం గ్రామస్తులు శుక్రవారం సాయంత్రం ఆందోళనకు దిగారు. రోడ్డు నిర్మించే క్రమంలో నాణ్యతను పాటించడం లేదని ఆరోపించారు. నాలుగు కాలల పాటు ఉండాల్సిన రోడ్డు ఉండడం లేదని, ఈ రోజు వేసిన రోడ్డు రేపటి వరకు పోతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు.

పెసా గ్రామసభలను బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న కొమురం ప్రభాకర్

ఎస్ఎస్ తాడ్వాయి: పెసా గ్రామ సభలను బలోపేతం చేయాలని ఏటూరునాగారం ఐటీడీఏ పెసా కోఆర్డినేటర్ కొమురం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పెసా అవగాహన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. గ్రామ సభలను బలోపేతం చేయాల్సిన బాధ్యత పెసా కమిటీలేదన్నారు. షెడ్యూల్ ప్రాంతంలో భారత రాజ్యంగా ప్రకారం పెసా కమిటీలను ఎన్నుకోవడం జరిగిందన్నారు. తెలంగాణ నూతన పంచాయతీ రాజ్ చట్టం 2018 ప్రకారం ప్రతి రెండు నెలలకు ఒకసారి పెసా గ్రామ సభలు నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ సుమనవాణి మాట్లాడుతూ.. ఏజెన్సీ గ్రామ్లాలో సీజనల్ వ్యాధులు, వరదలపై పెసా కమిటీలు పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ శ్రీధర్, పెసా మండల బాధ్యులు కొమురం చంద్రయ్య, అల్లెం నవీన్, ఎల్లబోయిన నగేష్, తల్లడి లక్ష్మయ్య, స్వామి, రమేష్, చర్పా రవి, సిద్ధబోయిన నర్సింగరావు, వట్టం కన్నయ్య, రవివర్మ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

మంగపేట: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మంగపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి వైశాలి అన్నారు. మండలంలోని చేరుపల్లి ఎస్టీ కాలనీలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్య శిబిరంలో 64 మందికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలకు వైద్య పరీక్షలు నిర్వహించి జాగ్రత్తలు పాటించాలని, ఆహార నియమాలు, వ్యాయమం గురించి వివరించారు. హైపర్ టెన్షన్, షుగర్ వ్యాధి గ్రస్తులకి ప్రత్యేక పరీక్షలు నిర్వహించి ప్రతి నెల పరీక్షలు చేపించుకొని క్రమం తప్పకుండా మందులు వాడాలని సూచించారు. ఈ నెల 20న నిర్వహిస్తున్న నులి పురుగుల నివారణ కార్యక్రమంలో 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు పిల్లల అందరికి తప్పకుండా ఆల్బెండజోల్ మాత్రలను వేయించాలన్నారు. హెచ్ఈఓ అబ్బాస్, ఏఎన్ఎం మమత, ఆశవర్కర్లు చంద్రవాణి, విజయలక్ష్మితో పాటు పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైశాలి

దేవస్థాన భూములను రక్షించాలి



రాస్తారోకో చేస్తున్న బెస్తగూడెం గ్రామస్తులు

వెంకటాపురం(కె): ఇష్టపూరి దేవస్థానానికి చెందిన భూములను రక్షించాలని కోరుతూ శుక్రవారం బెస్తగూడెం గ్రామస్తులు మండల కేంద్రంలోని శివాలయం గుడి సెంటర్‌లో గంట పాటు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. బెస్తగూడెం గ్రామ సమీపంలోని ఇష్టపూరి వినాయకుడి గుడి సమీపంలో గుడి నిర్వహణ కోసం భూమిని కేటాయించినట్లు తెలిపారు. కాగా, అట్టి భూమిపై ఛత్తీస్‌గఢ్ నుంచి వలస వచ్చి గిరిజనులు అక్రమించుకునేందకు కుట్రలు చేస్తూ ఆందోళన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేవస్థాన భూమిని అక్రమించుకోవటంతో దేవుడి దూప దీప నైవేద్యాల ఖర్చులకు ఇబ్బందులు పడాల్సి వస్తుందని అన్నారు. ఇప్పటికైన అధికారులు దేవస్థాన భూమిని దేవాలయానికి అప్పగించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఎస్సై అశోక్ సంఘటన ప్రాంతానికి చేరుకోని ఆందోళనకారులతో మాట్లాడి ఆందోళన విరమింప చేశారు.

రశీదు తప్పనిసరిగా తీసుకోవాలి

ఏటూరునాగారం: వానాకాలంలో విత్తనాలను కొనుగోలు చేసే ముందు రైతులు ఒకటికి రెండు సార్లు పరిశీలించి పరీక్షించుకున్న తర్వాతనే కొనుగోలు చేయాలని వ్యవసాయ అధికారి వేణుగోపాల్ అన్నారు. శుక్రవారం మండలంలోని రామన్నగూడెంలో రైతులతో వ్యవసాయ అధికారులు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ విత్తనాలు కొనుగోలు చేస్తే రశీదు తప్పనిసరిగా తీసుకోవాలని, సీడ్ లైసెన్స్ ఉన్న డీలర్ దగ్గర కొనుగోలు చేయాలన్నారు. పంట దిగుబడి వచ్చే వరకు రశీదు, విత్తన ప్యాకెట్ భద్రపర్చుకోవాలన్నారు. విత్తనాలపై తేదీలను చూసుకోవాలని తెలిపారు. 'కార్యక్రమంలో ఏఈఓ రాజు, స్పెషల్ ఆఫీసర్ రాజమొగిళి, రైతులు దొడ్డ కృష్ణ, అల్లి శ్రీనివాస్, చెన్నూరి బాలరాజు, ఎగ్గడి కోటేశ్వర్ రావు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఏఓ వేణుగోపాల్

నాగారంలో గ్రామసభ

వాజేడు: వర్షాకాలంలో చేపట్టవల్సిన కార్యాచరణ ప్రణాళికపై శుక్రవారం నాగారం గ్రామ పంచాయతీలో గ్రామ సభను నిర్వహించారు. ఈ గ్రామ సభలో పాల్గొన్న ఎంపీఓ శ్రీకాంత్ నాయుడు మాట్లాడుతూ.. వర్షాలు వస్తే ప్రజలు ఇబ్బందులు పడకుండా ఎలాంటి చర్యలను తీసుకోవాలనే విషయంపై చర్చించారు. వరదలు వస్తే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, నీటి నిలువలు లేకుండా ఎప్పటి కప్పుడు కాలువ ద్వారా బయటకు పంపించడం లాంటి కార్యక్రమాలపై చర్చించారు.

నులిపురుగుల నిర్మూలనతోనే ఆరోగ్యం



వాజేడు: ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, వైద్య సిబ్బంది



మంగపేట: ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారి యమున, సిబ్బంది

వాజేడు: నులిపురుగుల నిర్మూలనతోనే బాలబాలికల ఆరోగ్యంగా ఉంటారని తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ విజయ అన్నారు. మండల కేంద్రంలోని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం వాజేడు, పేరూరు వైద్య సిబ్బందితో టాస్క్‌ఫోర్స్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పిల్లలు ఆరోగ్యంగా ఉండాలంటే నులిపురుగుల నివారణ ముఖ్యమన్నారు. దీని కోసం 1 నుంచి 19 సంవత్సరాలు ఉన్న ప్రతీ బాలబాలికకు నులి పురుగుల మందులను వేయాలని సూచించారు. ఈ కార్యక్రమం జూన్ 20 నుంచి జూన్ 27 వరకు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. వైద్యులు మహేందర్, మధుకర్, గ్నానస, తరున్, నవీన్, కోటిరెడ్డి, వెంకట రమణ, ఆశ కార్యకర్తలు, వైద్యశాలల సిబ్బంది ఉన్నారు.

మంగపేట: ఈ నెల 20న నిర్వహించనున్న జాతీయ నులి పురుగుల దినోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని చుంచుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి చిన్నపెల్లి యమున అన్నారు. జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమంపై ఏఎన్ఎం, ఆశ వర్కర్లు, సిబ్బందితో అవగాహన సమావేశం శుక్రవారం నిర్వహించారు. నులి పురుగుల వలన వచ్చే అనారోగ్య సమస్యల గురించి, వాటిని అరికట్టే విధానాల గురించి వివరించారు. ఈ నెల 20న 1 నుంచి 19 సంవత్సరాల పిల్లలకి ఆల్బెండజోల్ మాత్రలను ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమం అనంతరం వైద్య సిబ్బందితో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

నిట్‌లో సీటు సాధించిన శ్రీకాంత్



తల్లి నాగమ్మతో శ్రీకాంత్

ఎస్ఎస్‌తాడ్వాయి: మండలంలోని జంపంగవాయి(కొత్తూరు) గ్రామానికి చెందిన అనుముల శ్రీకాంత్ కర్ణాటక నిట్ ఎంటెక్ సీటు సాధించాడు. శ్రీకాంత్ సీవిల్ ఇంజనీరింగ్ పూర్తి చేసి ఎంటెక్ కోసం ఎంటెన్స్ పరీక్షలు రాయగా అలిండియా గేట్‌లో 2,790 ర్యాంక్ సాధించాడు. దీంతో కర్ణాటక నిట్‌లో ఎంటెక్ సీటు వచ్చింది. పేదింటి కుటుంబానికి చెందిన శ్రీకాంత్ తండ్రి చిన్నతనంలో మృతి చెందాడు. తల్లి నాగమ్మ కూలి పనులు చేస్తూ శ్రీకాంత్‌ను బీటెక్ చదివించింది. పేద కుటుంబానికి చెందిన విద్యార్థి శ్రీకాంత్ హమాలి పనులు, ధాన్యం కాంటా పనులకు వెళ్తూ అలిండియా గేట్ ఎంట్రెన్స్ పరీక్ష రాసి ర్యాంకు సాధించడంతో కర్ణాటక నిట్‌లో ఎంటెక్ సీటు పొందాడు. ఎంటెక్ ప్రవేశం కోసం రూ.80వేల ఫీజు చెల్లించాల్సి ఉంది. పేదింటి కుటుంబానికి చెందిన విద్యార్థి శ్రీకాంత్ ఫీజు చెల్లించే ఆర్థిక స్తోమత లేకపోవడంతో ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్నాడు. దాతలు సాయం అందించి ఆదుకోవాలని శ్రీకాంత్ తల్లి నాగమ్మ కోరుతున్నారు.

విత్తన ఎంపికలో జాగ్రత్తలు పాటించాలి



వ్యవసాయ ఉత్పాదకాలను అందిస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

ములుగు రూరల్: వానాకాలం పంటల సాగులో విత్తన ఎంపిక, యాజమాన్య పద్ధతుల్లో రైతులు తగిన జాగ్రత్తలు పాటించాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ సహ సంచాలకుడు డాక్టర్ ఉమారెడ్డి సూచించారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ యూనివర్సిటీ, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ వరంగల్ ఆధ్వర్యంలో శుక్రవారం ములుగు మండలం చిన్న గుంటూరుపల్లిలో గిరిజన ఉప ప్రణాళిక (టీఎస్‌పీ) ద్వారా పత్తి పంట సాగుపై రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులకు వ్యవసాయ ఇన్‌పుట్స్ (ఉత్పాదకాలు) పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ వి వెంకన్న, డాక్టర్ ఎస్. ఓంప్రకాష్, డాక్టర్ వై. ప్రశాంత్, డాక్టర్ ఎం మధు, అశ్వినిలు వరిసాగు పద్ధతులు, పత్తిలో గులాబిరంగు పురుగు నివారణ, అధిక సాంద్రత, అపరాల సాగు, తెగుళ్ల నివారణపై వివరించారు. జిల్లా వ్యవసాయ అధికారి విజయ్‌చందర్, ఏడీఏ శ్రీపాల్, వ్యవసాయ అధికారి సతీశ్, ఏఈఓ అయేషాపర్వీన్, జ్యోతి, దేవగిరిపట్నం ఎఫ్‌పీఓ అధ్యక్షుడు అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భాషా పండిట్ల సంబురాలు



డీఈఓకు మిఠాయి తినిపిస్తున్న భాషాపండిట్లు

ములుగు: తమ పదోన్నతులకు వ్యతిరేకంగా వేసిన కేసు శుక్రవారం సుప్రీం కోర్టు కొట్టివేయడంతో తెలుగు, హిందీ భాషాపండిట్లు, పీఈటీలు సంబురాలు చేసుకున్నారు. జిల్లా కేంద్రంలోని విద్యాశాఖ కార్యాలయంలో డీఈఓ పాణిని, అధికారులు, సిబ్బందికి స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత్ పరిషత్ రాష్ట్ర జిల్లా ప్రధానకార్యదర్శి జట్టి సుభాష్ మాట్లాడుతూ.. సుప్రీం కోర్టు తీర్పుతో దశాబ్దాలుగా బాషాపండితులు చేస్తున్న పోరాటానికి తగిన న్యాయం జరిగిందని అన్నారు. పోరాటానికి మద్దతు ఇచ్చిన అన్ని సంఘాల సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటికైనా ఆలస్యం చేయకుండా బాషా పండితులకు పదోన్నతులు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ఆదిరెడ్డి, పాడ్య రవి, మమత, శ్రీలక్ష్మీ, సునీత, సంధ్యారాణి పాల్గొన్నారు.

గుడుంబా విక్రయిస్తే చర్యలు



కన్నాయిగూడెం: గుడుంబా విక్రయిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఏటూరునాగారం ఎక్సైజ్ సీఐ రామకృష్ణ అన్నారు. మండలంలో బుట్టాయిగూడెం, సింగారం, రాజన్నపేట, దేవాదూల గ్రామాల్లో గుడుంబా అమ్ముతున్న వ్యక్తులను తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ సర్వర్ పాషా బైండోవర్ చేశారు. బుట్టాయిగూడెం నుంచి కుమ్మరి అంజయ్య, కుమ్మరి పోషయ్య, కుమ్మరి హరిబాబు, గాండెర్ల బాబు, కావిరి మహేందర్, సింగారం నుంచి పల్లా నర్సింహాయ్య, రాజన్నపేట నుంచి తూరం మహేష్, వాసం అప్పారావు, దేవాదుల నుంచి చిలులముల రమేష్‌లను బైండవర్ చేసినట్లు సీఐ రామకృష్ణ తెలిపారు.